కరెంటు కొరత తీర్చడానికి ప్రణాళిక

కొత్తగా జెన్‌కోకు అల్ట్రామెగా, న్యూక్లియర్ పవర్ ప్లాంట్లు
మార్చినాటికి 620 మెగావాట్ల కరెంట్ ఉత్పత్తి : వైఎస్

(ప్రజాశక్తి-హైదరాబాద్‌బ్యూరో)

రబీ సీజన్‌లో ఎలాంటి ఇబ్బందులూ లేకుండా సేద్యానికి రెండు విడతలుగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి ఇప్పటి నుంచే ముందస్తు చర్యలను తీసుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విద్యుత్ అధికారులను ఆదేశించారు. విద్యుత్ డిమాండ్-సరఫరా పరిస్థితులపై ఆదివారం సిఎం క్యాంప్ కార్యాలయంలో మంత్రి మహ్మద్ అలీ షబ్బీర్, విద్యుత్ శాఖ అధికారులతో సిఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ మన వద్ద ఉన్న ఉత్పాదక సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవడమే కాకుండా లభ్యత అందుబాటులో ఉన్న అన్ని చోట్ల నుంచి వేల కోట్ల రూపాయలు వెచ్చించి విద్యుత్‌ను కొనుగోలు చేసి సరఫరా చేశామని చెప్పారు. ఖరీఫ్ సీజన్‌లో ఒక దశలో అత్యధికంగా రోజువారీ విద్యుత్ వినియోం రాష్ట్ర విద్యుత్ రంగం చరిత్రలోనే రికార్డు స్థాయిలో 202 మిలియన్ యూనిట్లకు చేరినా మనం పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొన్నామని వివరించారు. వచ్చే రబీలో రోజువారీ విద్యుత్ వినియోగం సుమారుగా 210 మిలియన్ యూనిట్లకు పెరగవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారని, దీన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. రాష్ట్రంలో రోజురోజుకూ విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతోందని, 2003-04 సంవత్సరంలో 23 లక్షలుగా ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు నేడు సమారుగా 26.5 లక్షలకు పెరిగాయని చెప్పారు. దీనికి తోడు అనధికారికంగా దాదాపు 4 లక్షల పంపుసెట్లు ఉన్నాయన్నది ఒక అంచనా అని ముఖ్యమంత్రి వివరించారు. అలాగే ఏడాదికి సుమారుగా 12 వేల మిలియన్ యూనిట్లుగా ఉన్న వ్యవసాయ వినియోగం నేడు 16వేల యూనిట్లకు చేరుకుందని చెప్పారు. నేడు దేశంలోనే అత్యధిక వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్న రాష్ట్రాలలో మన రాష్ట్ర ముందంజలో ఉందని, అలాగే దేశంలోనే అత్యధికంగా దాదాపు 35శాతం విద్యుత్‌ను సేద్యానికి సరఫరా చేస్తున్నదీ మనమేనని సిఎం వివరించారు. రాష్ట్రంలో విద్యుత్ కొరత లేకుండా, రైతులకు 7 గంటలకు తక్కవ కాకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు విద్యుత్ శాఖకు ఎంత డబ్బు కావాలో చెప్పాలని, ఎన్ని వేల కోట్లయినా ఇస్తామని ముఖ్యమంత్రి అన్నారు. చేవేళ్ళ నుంచి ఇచ్ఛాపురం దాకా ఎక్కడా ఒక్క ఎకరా ఎండినా సహించనని, నిధులిచ్చే బాధ్యత తమదని అధికారులను హెచ్చరించారు. ఆరు నూరైనా కావాల్సిన కరెంటు రైతుకు మనం ఇవ్వాల్సిందే. ఇదేదో పెద్ద త్యాగం కాదు. మనందరి విద్యుక్తధర్మం' అని అధికారులతో ముఖ్యమంత్రి చెప్పారు. పండించితేనే ఫలసాయం చేతికెలా వస్తుందో అలాగే నిర్దిష్టమైన దీర్ఘకాలిక ప్రణాళిక ద్వారానే రాష్ట్రంలో డిమాండ్‌కు సరిపడా విద్యుత్‌ను ఉత్పత్తి చేయగల ప్రాజెక్టులను ఏర్పాటు చేసుకోవచ్చని చెప్పారు.

నాలుగేళ్లలో 1100 మెగావాట్ల విద్యుత్తుత్పత్తి సాధించామని, వచ్చే మార్చిలోగా మరో 620 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని సాధించాలన్నది తమ లక్ష్యమని ముఖ్యమంత్రి చెప్పారు. 2011-12 సంత్సరానికల్లా నిర్మాణంలో ఉన్న విద్యుత్ ప్రాజెక్టులను అనుకున్న ప్రకారం పూర్తిచేసి అదనంగా 9వేల మెగావాట్ల విద్యుత్తుత్పత్తిని సాధించాలన్నదే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ఇవేగాక భారత్-అమెరికా అణు విద్యుత్ ఒప్పందం ఫలితాలను పురస్కరించుకొని దాని ఫలాలను మన రాష్ట్ర ప్రజలే ముందుగా పొందాలనే రెండువేల మెగావాట్ల సామర్థ్యం గల అణు విద్యుత్ ప్రాజెక్టును కడపలో నిర్మించడానికి ప్రతిపాదించామని, ప్రకాశం జిల్లా వాడరేవు వద్ద జెన్‌కో ఆధ్వర్యంలో మరొక అల్ట్రా మెగా ప్రాజెక్టును నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. రాష్ట్రంలోని ప్రాజెక్టులకు గ్యాస్ కేటాయింపులు లభించి, తక్కిన ప్రాజెక్టులన్నీ పూర్తయితే రానున్న రెండు మూడేళ్ళలో రాష్ట్రం మిగులు విద్యుత్తుతో విద్యుత్ ఉత్పాదనలో స్వయం సమృద్ధి సాధిస్తుందని చెప్పారు.

రక్షకులే భక్షకులైతే...

కంధ్‌మాల్‌లో పోలీసు వేధింపులు - మహిళలపై అత్యాచారాలు
ప్రతిఘటిస్తే చావుదెబ్బలు - హక్కుల కమిషన్‌కు గిరిజనుల ఫిర్యాదు

భువనేశ్వర్ : మత ఘర్షణలతో అట్టుడికిన ఒరిస్సాలోని కంధ్‌మాల్‌లో ఇప్పుడు గిరిజనులకు మరో సమస్య ఎదురవుతోంది. వారికి పోలీసుల నుండి వేధింపులు అధికమయ్యాయి. మహిళలపై అత్యాచారానికి కూడా పాల్పడుతున్నారు. దీనిపై గిరిపుత్రులు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు కూడా చేశారు. పోలీసుల వేధింపులపై విచారణ జరిపి బాధ్యులైన వారిని శిక్షించాలని కమిషన్‌ను అభ్యర్థించారు. గిరిజనుల తరపున ఫిర్యాదు దాఖలు చేసిన వనవాసి కళ్యాణ్ ఆశ్రమ్ (వికెఎ) ప్రధాన కార్యదర్శి ఎల్‌కె దాస్ ఆదివారం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ మత ఘర్షణలను అదుపు చేసేందుకు నియమించిన సిఆర్‌పి జవాన్లు పురుషులు లేని సమయాల్లో తమ ఇళ్లపై దాడి చేసి మహిళలపై అత్యాచారాలకు పూనుకుంటున్నారని వాపోయారు. కంధ్‌మాల్‌లో పోలీసులు మహిళలపై జరిపిన అత్యాచారాల విషయంలో ఉన్నత స్థాయి దర్యాప్తు జరిపించాలంటూ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, జాతీయ మహిళా కమిషన్‌కు వినతిపత్రాలు సమర్పించారు. ఏ తప్పూ లేకపోయినా వందలాది మంది అమాయకులను, ముఖ్యంగా కంధ్ తెగకు చెందిన గిరిజన మహిళలు, పిల్లలను పోలీసులు తీవ్ర స్థాయిలో చిత్రహింసలకు గురి చేశారని వికెఎ ఆరోపించింది. ఈ వేధింపులపై దర్యాప్తు జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని విజ్ఞప్తి చేసింది. పురుషులు అడవుల్లోకి వెళ్లిపోయారని నిర్ధారించుకున్న తరువాతే పోలీసులు ఇళ్లలోకి చొరబడి మహిళలపై దౌర్జన్యానికి దిగుతున్నారు. పోలీసుల చిత్రహింసలను భరించలేని మహిళలు సిఆర్‌పి జవాన్లపై ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్లకు వెళితే అక్కడ వారిని అరెస్ట్ చేసి జైలులో పెడతామంటూ బెదిరిస్తున్నారు. సహాయ శిబిరాల నుండి తిరిగి వచ్చిన తరువాత ప్రతీకార దాడులకు పాల్పడతామని మైనార్టీలు సైతం తమను బెదిరిస్తున్నారని శిశుపంకా గ్రామానికి చెందిన ప్రమీలా ప్రధాన్, పజిమా గ్రామానికి చెందిన పజిమా మల్లిక్ తెలిపారు. తాము పండించుకున్న కూరగాయలను, పెంచుకుంటున్న కోళ్ళు, మేకలను సిఆర్‌పి జవాన్లు ఎత్తుకెళుతున్నారని, ఎవరైనా వారిని ప్రతిఘటిస్తే చితక బాదుతున్నారని చెప్పారు. గాసాబీడాకు చెందిన ఒక మహిళపై సిఆర్‌పి జవాను అత్యాచారం చేశారని వికెఎ నేత దాస్ తన వినతిపత్రంలో తెలిపారు. గొచ్చాపాడ, ఉదయగిరి, రైకియా, ఫిరింజియా తదితర ప్రాంతాల నుండి సైతం పోలీసుల వేధింపులపై తమకు ఫిర్యాదులందాయని ఆయన వివరించారు. జజీనా గ్రామంలో చెరువులో స్నానం చేస్తున్న ఎనిమిది మంది మహిళలపై సుమారు 20 మంది సిఆర్‌పి జవాన్లు అత్యాచారానికి పాల్పడ్డారు. మందకియా గ్రామంలో మహిళలపై అత్యాచారం చేయటంతో పాటు వాటిని ప్రతిఘటించిన పురుషులను చితకబాదారు. మరో సంఘటనలో గావ్‌నాలా గ్రామానికి చెందిన ఒక మహిళను చితకబాది ఆమెకు చెందిన ఇద్దరు మైనర్ బాలికలను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారని, వారిని ఒక రోజంతా జైలులో వుంచి మరుసటి రోజు ఎటువంటి వైద్యపరీక్షలు నిర్వహించకుండానే జైలుకు పంపించారని వికెఎ ప్రధాన కార్యదర్శి తన వినతిపత్రంలో తెలిపారు.

కాశ్మీర్ ఎన్నికల షెడ్యూలు వివరాలు

షెడ్యూలు వివరాలివి...

నోటిఫికేషన్ జారీ	నామినేషన్ల స్వీకరణ గడువు	పరిశీలన	ఉపసంహరణ గడువు	ఎన్నిక తేదీ
తొలిదశ అక్టోబర్ 24	అక్టోబర్ 31	నవంబర్ 1	నవంబర్ 3	నవంబర్ 17
రెండోదశ అక్టోబర్ 29	నవంబర్ 5	నవంబర్ 6	నవంబర్ 8	నవంబర్ 23
మూడోదశ నవంబర్ 4	నవంబర్ 11	నవంబర్ 12	నవంబర్ 14	నవంబర్ 30
నాల్గోదశ నవంబర్10	నవంబర్ 17	నవంబర్ 18	నవంబర్ 20	డిసెంబర్ 7
ఐదో దశ నవంబర్ 17	నవంబర్ 24	నవంబర్ 25	నవంబర్ 27	డిసెంబర్ 13
ఆరోదశనవంబర్ 22	నవంబర్ 29	డిసెంబర్ 1	డిసెంబర్ 3	డిసెంబర్ 13
తుది దశనవంబర్ 26	డిసెంబర్ 3	డిసెంబర్ 4	డిసెంబర్ 6	డిసెంబర్ 24

బలీయశక్తిగా తృతీయ కూటమి : దేవెగౌడ

న్యూఢిల్లీ : రాబోయే లోక్‌సభ ఎన్నికల అనంతరం తృతీయ కూటమి ఒక బలీయశక్తిగా ఆవిర్భవించడం ఖాయమని జనతాదళ్ (ఎస్) అధ్యక్షుడు, మాజీ ప్రధానమంత్రి హెచ్‌డి దేవెగౌడ ధీమా వ్యక్తం చేశారు. దేశంలో మతసామరస్యం నెలకొల్పేందుకు మరిన్ని పార్టీలు తృతీయ కూటమిలో భాగస్వాములు కాబోతున్నాయని చెప్పారు. ఆదివారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ నూటికి నూరు శాతం తృతీయ కూటమి ఒక రూపం సంతరించుకోనుందని తెలిపారు. దేశంలో మత పరమైన హింసాకాండ పెచ్చరిల్లుతున్న నేపథ్యంలో లౌకిక వాతావరణాన్ని సృష్టించే క్రమంలో తమది కీలకపాత్ర అని వివరించారు. క్రైస్తవుల మీద జరిగిన దాడులను దేవెగౌడ తీవ్రంగా ఖండించారు. వరుసబాంబు పేలుళ్ళు, జామియానగర్ ఎన్‌కౌంటర్, మత హింసపై ఆగ్రహం వెలిబుచ్చారు. జరుగుతున్న ఈ దారుణ సంఘటనలే తమను ఒక బలీయమైన సంఘటిత శక్తిగా నిలబెడతాయని చెప్పారు.

దురదృష్టకరం.. అయినా పాల్గొంటాం..!

కాశ్మీర్ ఎన్నికల షెడ్యూల్‌పై సిపిఎం

శ్రీనగర్ : కాశ్మీర్ అసెంబ్లీకి కేంద్ర ఎన్నికల కమిషన్ ఏడంచెల ఎన్నికల షెడ్యూల్ ప్రకటించటం దురదృష్టకరమని సిపిఎం వ్యాఖ్యానించింది. ఈ ఏడంచెల ఎన్నికల్లో పాల్గొనడం అన్ని రాజకీయ పార్టీలకూ ఒక సవాలే అయినా తాము ఈ ఎన్నికల బరిలో దిగుతామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ యూసుఫ్ తరిగామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే ముందు ప్రజల్లో విశ్వాస కల్పన చర్యలు తీసుకోవడం ప్రధానమని తాము కేంద్ర ఎన్నికల కమిషన్ బృందానికి, ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు వివరించామని ఆయన చెప్పారు. ఇసి ప్రకటించిన ఎన్నికల షెడ్యూల్‌పై స్పందిస్తూ ప్రజల్లో విశ్వాస కల్పన చర్యలు తీసుకొన్న తరువాతే ఎన్నిలకు తాము సుముఖంగా ఉన్నామని ఆయన వివరించారు. అయితే ఎన్నికల కమిషన్ తమ సూచనను పరిగణనలోకి తీసుకోకుండా షెడ్యూల్ ప్రకటించడం దురదృష్టకరమని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించేందుకు అవకాశం కల్పించే ఈ షెడ్యూల్ అన్ని పార్టీలకూ పెద్ద సవాలువంటిదన్నారు. గవర్నర్ పాలన ప్రజాస్వామ్యానికి ప్రత్యామ్నాయం కాబోదని, ఈ దృష్ట్యా తాము ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములవుతామని ఆయన చెప్పారు.

బిజెపి హర్షం

జమ్మూకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను తాము స్వాగతిస్తున్నట్లు బిజెపి ప్రకటించింది. ఈ ఎన్నికలు స్వేచ్ఛగా, సక్రమంగా జరగగలవని భావిస్తున్నట్లు బిజెపి ఉపాధ్యక్షుడు ముక్తార్ అబ్బాస్ నక్వీ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మిగిలిన ఐదు రాష్ట్రాలతో పాటే కాశ్మీర్ ఎన్నికల షెడ్యూల్ కూడా ప్రకటించి ఉంటే బాగుండేదన్నారు. జమ్మూకాశ్మీర్‌లో ఎన్నికలు ఎప్పుడూ జాతీయవా దులకు, వేర్పాటువాదులకు మధ్యే జరుగుతున్నా యన్నారు. ఈ ఎన్నికల్లో జాతీయవాదశక్తులదే విజయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

మణిపూర్ సిఎం నివాసం వద్ద పేలుడు

ఇంఫాల్ : మణిపూర్ ముఖ్యమంత్రి వోక్రాం ఇబోబి సింగ్ అధికారిక నివాసం గేటు వద్ద ఆదివారం పెద్ద పేలుడు సంభవించింది. దీంతో మణిపూర్‌లో హైఅలర్ట్ ప్రకటించారు. రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో చోటుచేసుకున్న ఈ సంఘటనలో ఎటువంటీ నష్టమూ జరగలేదు. 39వ జాతీయ రహదారి మీదుగా ఓ కారులో వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తులు ముఖ్యమంత్రి నివాసం గేటు ముందు బాంబులు వేసి వెళ్లారని పోలీసులు తెలిపారు.

చెరువులో నుండి బస్సును వెలికితీస్తున్న దృశ్యం

చెరువులో పడిన పెళ్లి బస్సు

మహిళ, ఇద్దరు బాలికల మృతి
20 మందికి గాయాలు- మరో 23 మంది సురక్షితం

(ప్రజాశక్తి విలేకరి - గన్నవరం)

ప్రకాశం జిల్లాలో పెళ్లి వ్యాను ప్రమాదానికి గురై పది మంది మరణించిన సంఘటన మరువక ముందే కృష్ణాజిల్లాలో మరో ప్రమాదం జరిగింది. ఉంగుటూరు మండలం తరిగొప్పుల వద్ద ఆదివారం సాయంత్రం పెళ్లి బస్సు చెరువులోకి బోల్తా కొట్టింది. ఈ సంఘటనలో ముగ్గురు మరణించారు. 43 మంది సురక్షితంగా బయటపడ్డారు. అందులో కనీసం 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. మరో 10 మందికి స్వల్ప గాయాలయ్యాయి. బస్సును అర్థరాత్రి 12 గంటలకు వెలికితీశారు. ప్రమాదం నుంచి బయటపడిన వారి వివరాల ప్రకారం.. గన్నవరంలో జరిగే పెళ్లికి వెళ్లేందుకు పెళ్లి కుమారుని తరపువారు ప్రైవేట్ హైటెక్ బస్సు అద్దెకు తీసుకుని ఉంగుటూరు మండలం మానికొండ నుంచి సాయంత్రం బయలు దేరారు. బస్సు వేగంతో వెళ్తుండడంతో తరిగొప్పుల గ్రామం దాటాక మలుపు వద్ద అదుపుతప్పి పక్కనే ఉన్న పత్తల్లోడి చెరువులోకి దూసుకుపోయి బోల్తా కొట్టింది. బస్సులో 46 మంది ఉన్నారు. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ గంపా రామయ్య నేతృత్వంలో తరిగొప్పుల గ్రామస్తులు చెరువు వద్దకు వచ్చి బస్సులోని 43 మందిని రక్షించారు. ముగ్గురు మృతి చెంది కనిపించారు. మృతులను హారతి(30), హేమాంజలి(13), విష్ణుప్రియ(11)గా గుర్తించారు. 108 అంబులెన్సుకు సమాచారమందించారు. ఒడ్డుకు వచ్చిన కొంతమందికి కాళ్లూ చేతులూ విరగడంతో ప్రాథమిక చికిత్స చేసి ఉన్నత వైద్యం కోసం గుడివాడ పంపించారు. తరిగొప్పుల, మానికొండ, బూతిమిల్లిపాడు నుంచి సుమారు రెండు వేల మంది ప్రజలు చెరువు వద్దకు రావడంతో వెలికితీత కార్యక్రమం ఆలస్యమయ్యింది. విజయవాడ నుంచి రెండు క్రేన్లు తెప్పించారు. జిల్లా కలెక్టర్ శైలజా రామయ్యర్, జాయింట్ కలెక్టర్ రామయ్య, గన్నవరం శాసనసభ్యులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, మాజీ శాసనసభ్యులు దాసరి బాలవర్ధనరావు, సిపిఎం గన్నవరం, ఉంగుటూరు మండల కార్యదర్శులు కళ్లం వెంకటేశ్వరరావు, తెల్లాకుల లక్ష్మణస్వామి, నాయకులు జగన్ తదితరులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గన్నవరం, ఉంగుటూరు, కంకిపాడు, ఉయ్యూరు, విజయవాడ నుంచి 108 వాహనాల సిబ్బంది చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు. విజయవాడ ఏసిపిలు దగ్గరుండి పర్యవేక్షించారు.

మృతులకు లక్ష చొప్పున ఎక్స్‌గ్రేషియో

మృతుల కుటుంబాలకు లక్ష రూపాయల చొప్పున ఎక్స్‌గ్రేషియో ఇవ్వనున్నట్లు కలెక్టర్ శైలజా రామయ్యర్ ప్రకటించారు. బాధితులను ఆదుకోవాలని తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు స్థానిక నాయకులను ఆదేశించారు.

బంజారాహిల్స్‌లో ప్రజారాజ్యం పార్టీ కొత్త కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న చిరంజీవి

దీపావళికి ముందే తెలంగాణలో యాత్ర

కొత్త ఆఫీసు ప్రారంభోత్సవంలో చిరంజీవి

(ప్రజాశక్తి-హైదరాబాద్‌బ్యూరో)

దీపావళి పండుగకు ముందే తెలంగాణ జిల్లాల్లో మొదటి దఫా యాత్ర చేయాలని భావిస్తున్నట్లు ప్రజారాజ్యం పార్టీ అధినేత చిరంజీవి చెప్పారు. అయితే పార్టీలోని పెద్దలు ఏ విధంగా ప్లాన్‌చేస్తారో దానికనుగుణంగా వెళ్తామని తెలిపారు. ఈ యాత్రలో రెండు జిల్లాల్లో పర్యటించబోతున్నామని, ఆ రెండు జిల్లాలేవో అతిత్వరలో ప్రకటిస్తామని అన్నారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని రోడ్‌నెంబర్ ఐదులో కొత్తగా నిర్మించిన పార్టీ రెండో కార్యాలయాన్ని చిరంజీవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర పర్యటనతో ఉద్వేగం, ఉద్విగ్నతకు లోనయ్యానని తెలిపారు. అనూహ్య స్పందన వస్తుందని తెలుసని, కానీ ఊహకు మించి వచ్చిన ప్రజలకు, వారి అభిమానానికి, ఆత్మీయతకు కృతజ్ఞతలు అని అన్నారు. వచ్చిన జనం తనతో ఏదో చెప్పాలని వస్తున్నారని, వారిని చూసిన కొద్దీ తనలో కర్తవ్యం, బాధ్యత పెరుగుతున్నాయని చెప్పారు. మళ్లీ ఎప్పుడెప్పుడు ప్రజల్లోకి వెళ్తానా... అని ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. రోజులు గడిచిన కొద్దీ కొత్త ఉత్సాహం తనలో వస్తోందని, కొంత మంది పార్టీలో నిశ్శబ్ద సైనికులుగా పనిచేసి యాత్రను విజయవంతం చేశారని తెలిపారు. యాత్రలో అక్కడక్కడా ఇబ్బందులు వచ్చిన మాట వాస్తవమేనని, అదే విధంగా కొన్ని దుర్ఘటనలు కూడా జరిగాయని, మృతిచెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నానని తెలిపారు. ఇకపై ఇలాంటి సంఘటనలు జరగకుండా చూసుకుంటామని, అదే విధంగా ప్రజలు సంయమనంతో ఉండాలని కోరారు. పార్టీ రాష్ట్ర నాయకులు తోట చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర యాత్రలో ప్రజలు మార్పుకోరుకుంటున్నారని స్పష్టమైందని అన్నారు. సామాజిక న్యాయం, అందరికీ సమానం అనే సూత్రంపై పార్టీ ఏర్పడిందని తెలిపారు. అభిమానుల కోసం ఈ కార్యాలయం కూడా సరిపోదని, అధికారంలోకి వచ్చాక పదిరెట్ల పెద్ద ఆఫీసును నిర్మించుకుందామని అన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో మూడు లక్షల సభ్యత్వం పూర్తయిందని, ఒక్క శ్రీకాకులం జిల్లాలోనే రెండు రోజుల్లో లక్ష సభ్యత్వం జరిగిందని తెలిపారు. పార్టీ నేత హరిరామజోగయ్య మాట్లాడుతూ తాను ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ విజయం సాధిస్తుందని రాజకీయ పరిశీలకులు అంటారని, ఈ సారి పిఆర్‌పి తప్పకుండా అధికారాన్ని పొందుతుందని జోస్యం చెప్పారు. మరోనేత కెపిఎస్‌ఆర్ మూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో చేనేత కార్మికుల పరిస్థితి దారుణంగా ఉందని, చిరంజీవి వెళ్లి వచ్చిన వెంటనే అందరూ ఉరుకులు పరుగులు పెడుతున్నారని అన్నారు. సమావేశంలో నాయకులు విజిఆర్ నారగోని, పార్టీ అధికార ప్రతినిధి డాక్టర్ మిత్రా, ఐపిఎస్ మాజీ అధికారి అంజనేయరెడ్డి, పవన్‌కళ్యాన్ తదితరులు పాల్గొన్నారు.

23 నుంచే యాత్ర...?

ఈ నెల 23 నుంచి తెలంగాణ జిల్లాల్లో చిరంజీవి యాత్ర ప్రారంభం కానున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ముందుగా వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో యాత్ర జరగనుంది. కరీంనగర్ జిల్లాలో యాత్రను ప్రారంభించి నాలుగు రోజుల్లో పూర్తి చేయాలని భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. 26వ తేదీన యాత్రను ముగించి దీపావళి పండుగ తరువాత రాయలసీమలోని ఒక జిల్లాలో టూర్ నిర్వహించాలని సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు తెలిసింది.

ఆదుకోని ఆరోగ్యశ్రీ

బాలిక మృతి

(ప్రజాశక్తి విలేకరి-చిప్పగిరి)

ఆ కుటుంబంలో ఆ బాలిక చిన్నకూతురు కావడంతో అల్లారుముద్దుగా పెంచుకున్నారు. పదేళ్లయినా నిండకముందే బాలిక గుండెకు చిల్లు పడింది. అసలే నిరుపేద కుటుంబం. బాలికకు వచ్చిన జబ్బును చూసి తల్లిదండ్రులు దిగాలుపడ్డారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా తమ కూతురును బతికించుకోవచ్చని ఆనందంతో ఆరోగ్యశ్రీ కార్డు తీసుకొని హైదరాబాదు గాంధీ ఆసుపత్రికి వెళ్లారు. కానీ ఆరోగ్యశ్రీ ఆదుకోలేదు. బాలిక జబ్బు నయమూ కాలేదు. ఫలితం.. నెల రోజుల నుంచి మృత్యువుతో పోరాటం సాగించిన ఆ బాలిక శనివారం రాత్రి కన్నుమూసింది. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్యం అందక మృతి చెందిన పేదల జాబితాలో కర్నూలు జిల్లా బాలిక చేరింది. కర్నూలు జిల్లా చిప్పగిరి గ్రామంలో నివసించే ఆటో డ్రైవర్ దూదేకుల అల్లాబకాష్, మస్తానమ్మ దంపతుల రెండో కూతురు షబానాబేగం గుండె జబ్బుతో బాధపడ్తోంది. వెంటనే ఆరోగ్యశ్రీ కార్డు తీసుకొని గతనెల 14న హైదరాబాదు కేర్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వెళ్లారు. అక్కడ నుంచి గాంధీ ఆసుపత్రికి తరలించి కొన్ని రోజుల పాటు చికిత్సలు చేశారు. అక్కడా డాక్టర్లు చేతులెత్తేయడంతో తిరిగి సెప్టెంబర్ 28న సొంత ఊరు చేరుకున్నారు. ఆ బాలిక ఆరోగ్యం రోజురోజుకూ క్షీణించడంతో గుంతకల్లు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ శనివారం రాత్రి మృతి చెందింది. కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ పేరు చెప్పి కోట్ల రూపాయల ప్రభుత్వ ధనాన్ని దోచుకుంటున్నారే తప్ప పేదలకు వైద్యం అందించడంలేదని తల్లిదండ్రులు వాపోయారు. హైదరాబాదులోని డాక్టర్ల నిర్లక్ష్యం వల్లే తమ కూతురు కన్నుమూసిందని వారు విలపించారు.

ఆ కుటుంబాన్ని ఆదుకోవాలి : ఎమ్మెల్సీ మసాల పద్మజ

ఆరోగ్యశ్రీ కార్డున్నా వైద్యం అందక శనివారం మరణించిన షబానాబేగం కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ఎమ్మెల్సీ మసాల పద్మజ ప్రభుత్వాన్ని కోరారు. ఆరోగ్యశ్రీ పేరుతో ప్రభుత్వం కార్పొరేట్ ఆసుపత్రుల ద్వారా కోట్ల రూపాయలు దండుకుంటుందే తప్ప నిరుపేదలకు వైద్యం అందించడం లేదని విమర్శించారు. ఆరోగ్యశ్రీ ఉన్నా ఎంతోమంది మృత్యువాత పడుతున్నారని పేర్కొన్నారు. మృతిచెందిన షబానాబేగం ఉదంతమే ఇందుకు నిదర్శనమన్నారు.

మొదటి పేజీ తరువాయి

'మామ' మర్మం ఛేదించనున్న ఇస్రో

చేస్తున్నాయి. చంద్రయాన్‌లో 11 ప్రయోగాలు చేయనున్నారు. అందులో భారతదేశానికి సంబంధించి 5 కాగా, విదేశాలకు సంబంధించి 6 పరికరాలను ఉపయోగిస్తున్నారు. ప్రయోగం విజయవంతమైతే త్రీజీ అట్లాస్ చంద్రమండలం నమూనా తయారు చేయాలనేది ముఖ్య ఉద్దేశ్యం, చంద్రునితోపాటూ ధ్రువాలను కూడా అట్లాస్‌లో తయారు చేస్తారు. అలాగే మొట్టమొదటిసారి 'చంద్రయాన్' ఉపగ్రహంలో మరో బుల్లి ఉపగ్రహాన్ని పంపుతున్నారు. చంద్రుని చుట్టూ 100 కిలోమీటర్ల పరిధిలో 'చంద్రయాన్' తిరుగుతున్నప్పుడు ఉపగ్రహాన్ని చంద్రునిపై ప్రయోగించి అక్కడున్న రహస్యాన్ని ఛేధిస్తామని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఖనిజసంపదను కనుక్కోవడం, అవి ఏ రూపంలో ఉన్నాయో తెలుసుకోవడం, అవి ఎంత ఉన్నాయో అధ్యయనం చేయడానికి ఈ ప్రయోగం ఉపయోగ పడుతుంది. దీంతోపాటూ మూనిఇంపాక్టు చంద్రునికి సంబంధించిన ఫోటోలను ఉపగ్రహం తీసి పంపుతుంది. ఉపగ్రహం చంద్రుని వద్దకు చేరిన తర్వాత వారంలో ఈ ప్రక్రియ ప్రారంభమౌతుంది. ఉపగ్రహంలో ఎక్స్‌రేలు కూడా అమర్చారు. బెంగుళూరులో ఏర్పాటు చేసిన డీప్‌స్పేస్‌నెట్‌వర్క్ ఉపగ్రహానికి అనుసంధానంగా ఉంటుంది. ఈ 11 పరికరాలు, ప్రయోగాలకు సంబంధించి ఎవరెవరికి ఏ సమాచారం ఇవ్వాలో ఇక్కడ నుండే అందజేస్తారు.

386 కోట్లు వ్యయం

చంద్రయాన్-1 ప్రయోగానికి 386 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. పిఎస్‌ఎల్‌వి రాకెట్‌కు 100 కోట్లు, చంద్రయాన్ ఉపగ్రహానికి 186 కోట్లు యితరాత్ర కర్చవుతుంది.

హస్తినలో కూలిన మెట్రో ఫ్లైఓవర్

వివరించారు. ప్రాథమిక సాక్ష్యాధారాల ప్రకారం లాంచర్‌లో తలెత్తిన యాంత్రిక వైఫల్యమే ఇందుకు కారణమని తేలిందని, అయితే ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తుకు ఆదేశించామని ఆయన వివరించారు. ఈ విచారణకు ముగ్గురు సభ్యుల కమిటీని నియమించినట్లు ఆయన చెప్పారు. మెట్రో రైల్వే చరిత్రలో తొలిసారిగా జరిగిన ఈ ఘటనకు పూర్తి బాధ్యతను మెట్రో రైల్వే సంస్థ స్వీకరిస్తుందని ఆయన చెప్పారు. సంఘటన జరిగిన కొద్దిసేపటికే ఆ ప్రాంతానికి ఫైరింజన్లు, సహాయక బృందాలు చేరుకొని సహాయక చర్యలు ప్రారంభించాయి. సంఘటన సమాచారం తెలిసిన వెంటనే ఆర్థిక మంత్రి ఎకె వాలియాతో కలిసి అక్కడికి చేరుకొన్న ఢిల్లీ ముఖ్యమంత్రి షీలాదీక్షిత్ ఈ దుర్ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని మెట్రో రైల్వే కంపెనీని ఆదేశించారు. అనంతరం ఆమె ఆసుపత్రులకెళ్ళి క్షతగాత్రులను పరామర్శించారు. సంఘటనా స్థలాన్ని సందర్శించిన బిజెపి సీనియర్ నేత వికె మల్హోత్రా ఈ ఘటనపై న్యాయవిచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు.

చస్తేనే టిడిపి పింఛనిచ్చింది

జిల్లాకు తీరని అన్యాయం జరుగుతోందని అన్నారు. పరివాహక ప్రాంతం పేరుతో అభివృద్ధి చేయడంలేదని నిరసన వ్యక్తం చేశారు. ఇందుకు వై.ఎస్ స్పందిస్తూ ఈ సమస్య టిడిపి ప్రభుత్వం హయాంలో వచ్చిందని, అయినా పరిష్కారం కనుగొనేందుకు కృషిచేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇళ్లస్థలాలు, రోడ్ల కోసం స్థానికులు కొద్దిసేపు నిరసన వ్యక్తం చేశారు. మీ సమస్యలను పరిష్కరిస్తానని మంత్రి సబితారెడ్డి హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమనిగింది.

కాస్తులో ఉన్నాం..పాసుబుక్కులివ్వండి.!
సిఎం సభలో గిరిజనుల వినతి

"మేము ఎన్నో యేండ్లుగా ఈ భూముల్లో కాస్తులో ఉన్నాం..ఇప్పటి వరకూ భూమి పట్టా పాసుబుక్కుల్లేవ్.. పలుమార్లు ఎమ్మార్వోకు చెప్పినా పట్టించుకోలే..ఎన్నికలప్పుడు మంత్రి సబితారెడ్డి పట్టాలిప్పిస్తానని హామీ ఇచ్చారు. ఇంతవరకు ఇవ్వలేదు" అని పెద్దగోల్కొండ గ్రామపంచాయతీ పరిధిలోని లక్ష్మితండాకు చెందిన గిరిజనులు సిఎం సభ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలపై ముఖ్యమంత్రికి వినతిపత్రం యిద్దామని వచ్చేవరకే ఆయన సభ నుండి వెళ్లిపోతుండడంతో ఆందోళన చేశారు. దాంతో మంత్రి సబితారెడ్డి గిరిజనుల దగ్గరకొచ్చి ఈసారి తప్పకుండా పట్టాలు ఇప్పిస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఎన్నికల ముందు సబితారెడ్డి ఇచ్చిన హామీని అప్పుడే మార్చిపోయారంటూ మీడియా ముందు వారు ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రిని కలిసిన వారిలో భరతమ్మ, అంజయ్య, సత్తమ్మతో పాటు పలువురు ఉన్నారు.

భూ సేకరణకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమం

కొంటున్నారని విమర్శించారు. భూ సేకరణలో ప్రభుత్వ ప్రమేయం కచ్చితంగా ఉండాలని, లేకపోతే పేదలకు న్యాయం జరగదని చెప్పారు. భూ సేకరణ విషయమై సమగ్ర విధానాన్ని ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూములు కోల్పోయే రైతులకు ముందుగా ప్యాకేజీ ప్రకటించాలని, ఆ తర్వాతే భూమిని సేకరించాలన్నారు. బాధితులకు పరిహారంతో పాటు పరిశ్రమలో వాటా ఇవ్వాలని, వారి భవిష్యత్తరాలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కోస్తా కారిడార్, సెజ్‌లలో భూములు కోల్పోయిన బాధితులతో ప్రభుత్వం సమావేశం ఏర్పాటు చేయాలని, దానికి అఖిలపక్షాలను ఆహ్వానించాలని సూచించారు.

భూముల్నుంచి వేరు చేస్తున్న ప్రభుత్వం : నారాయణ

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె నారాయణ మాట్లాడుతూ తల్లి నుంచి బిడ్డను వేరు చేస్తున్నట్లుగా వైఎస్ ప్రభుత్వం పేదల నుంచి భూమిని వేరు చేస్తోందని విమర్శించారు. రాష్ట్రమంతటా పేదల భూములను లాక్కొని సెజ్‌లు, కోస్తా కారిడార్ పేరుతో ప్రభుత్వం సంపన్నులకు కట్టబెడుతోందని, నయా ఫ్యూడల్ వ్యవస్థను సృష్టిస్తోందని విమర్శించారు. దీన్ని అదుపు చేయలేకపోతే భవిష్యత్తరాలకు భూమి ఉండబోదని హెచ్చరించారు. ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో వాన్‌పిక్ సంస్థ కోసం వంద గ్రామాల పరిధిలో 26 వేల ఎకరాలు సేకరిస్తున్నారని చెప్పారు. అసలు సెజ్‌ల ఏర్పాటులో ఎంత మందికి ఉపాధి లభిస్తుందనే విషయంలో ఇప్పటికీ స్పష్టత లేదని వ్యాఖ్యానించారు. పోలేపల్లిలో దళిత, గిరిజన, బలహీన వర్గాలకిచ్చిన అసైన్డ్ భూమిని ప్రభుత్వం తక్కువ ధరకు వెనక్కి తీసుకుని, వారి పొట్టగొట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు.

పెద్ద గద్దల ప్రమేయం : కెసిఆర్

టిఆర్‌ఎస్ అధ్యక్షులు కెసిఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న భూ సేకరణ వెనుక ప్రభుత్వంలో ఉన్న పెద్ద గద్దల ప్రమేయముందని విమర్శించారు. ధనార్జనే ధ్యేయంగా, భూ సేకరణ పేరిట దేశంలోనే అతిపెద్ద కుంభకోణం మన రాష్ట్రంలో జరుగుతోందన్నారు. రాష్ట్రంలో ఉన్నది ప్రభుత్వమా? రియల్ ఎస్టేట్ బ్రోకరా? అని ప్రశ్నించారు. బీహార్, ఉత్తరప్రదేశ్‌ల్లోని మాఫియాల తరహాలో హైదరాబాద్‌లో భూ బకాసురులు తుపాకులు పట్టుకొని స్వైరవిహారం చేస్తున్నారని తెలిపారు. భూ వినియోగం, దాని కేటాయింపుపై శాస్త్రీయమైన విధానం ఉండాలని సూచించారు. సెజ్‌లకు వ్యతిరేకంగా అన్ని పార్టీలూ కలిసి ఒక వర్క్‌షాపును ఏర్పాటు చేయాలని, లోతుగా చర్చించాలని కోరారు. సెజ్‌లకు వ్యతిరేకంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

టిడిపి సీనియర్ నాయకులు లాల్‌జాన్‌బాషా మాట్లాడుతూ రైతుల నుంచి తక్కువ ధరకు భూమిని సేకరిస్తోన్న ప్రభుత్వం అతి తక్కువ ధరకే పారిశ్రామికవేత్తలకు కట్టబెడుతోందని ఆరోపించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పారిశ్రామికవేత్తల నుంచి వసూలు చేస్తున్న మొత్తాన్ని రైతులకే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సెజ్‌ల వ్యవహారం చూస్తుంటే ప్రభుత్వమే రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నట్లుగా ఉందని వ్యాఖ్యానించారు. ప్రజారాజ్యం పార్టీ అధికార ప్రతినిధి డాక్టర్ మిత్రా మాట్లాడుతూ తమ పార్టీ అధికారంలోకొస్తే సెజ్‌ల కోసం భూములను సేకరించేందుకు జారీ చేసిన జీఓలు రద్దు చేస్తామన్నారు. రైతులకు భూమిని తిరిగి ఇచ్చేస్తామని చెప్పారు. కోస్తా కారిడార్ వల్ల లక్షలాది మంది ప్రజలు, మత్స్యకారులు ఉపాధి కోల్పోతారని, కొన్ని గ్రామాలు అంతరించిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. లోక్‌సత్తా నాయకులు బోడేపూడి సత్యనారాయణ మాట్లాడుతూ తమ పార్టీ సెజ్‌లకు వ్యతిరేకం కాదని, అయితే దాని కోసం కాకులను కొట్టి గద్దలకు వేస్తున్న పద్ధతిలో భూ సేకరణ జరగడాన్ని మాత్రం వ్యతిరేకిస్తామన్నారు. దీనికి వ్యతిరేకంగా జరిగే హర్తాళ్లు, బంద్‌లు, రాస్తారోకోల్లో పాల్గొనబోమని తెలిపారు. ఇతర రూపాల్లో జరిగే నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటామని వివరించారు. అన్ని పార్టీలూ భూ సేకరణ చేపట్టబోమంటూ తమ ఎన్నికల మేనిఫెస్టోలో తెలపాలని ఎంబిటి నేత అమ్జాదుల్లాఖాన్ డిమాండ్ చేశారు. సెజ్‌ల చట్టాన్ని రద్దు చేయాలని సిపిఐ(ఎంఎల్-న్యూడెమొక్రసీ) నాయకులు గోవర్ధన్ డిమాండ్ చేశారు. రాజశేఖరరెడ్డి ప్రభుత్వం సెజ్‌ల పేరిట స్వతంత్ర రాజ్యాలు సృష్టిస్తోందని విమర్శించారు. మహబూబ్‌నగర్ జిల్లా పోలేపల్లి నుంచి వచ్చిన భూ సేకరణ బాధితులు చుక్కమ్మ, సలీం తమ బాధలను సమావేశంలో వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు, కె రామకృష్ణ, టిఆర్‌ఎస్ నాయకులు నాయిని నర్సింహారెడ్డి, జి విజయరామారావు, తదితరులు పాల్గొన్నారు.